అర్హులకు పథకాలు అందాలి

- ఇంటింటికీ వెళ్లి సమస్యలు తెలుసుకుంటున్నాం
- సమస్యలకు సత్వర పరిష్కారం చూపేందుకు చర్యలు
- 'గడప గడపకూ మన ప్రభుత్వం'లో ఎమ్మెల్యేలు కేతిరెడ్డి, శ్రీధర్‌రెడ్డి



ధర్మవరం: సమస్యలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే కేతిరెడ్డి



ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డికి స్వాగతం పలుకుతున్న గ్రామస్తులు, నాయకులు

ధర్మవరం: ప్రజల ఇంటి వద్దకే వెళ్లి సమస్యలను తెలుసుకుని పరిష్కరించడానికే గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహిస్తున్నామని ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి తెలిపారు. పట్టణంలోని 18వ వార్డులో శుక్రవారం గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే.. వార్డులో ఇంటింటికీ తిరుగుతూ ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. సాంకేతిక కారణాలతో ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందలేదని పలువురు లబ్ధిదారులు ఎమ్మెల్యేకు విన్నవించారు. వెంటనే పథకాలు వర్తించేలా చూడాలని సచివాలయ సిబ్బందిని ఎమ్మెల్యే ఆదేశించారు. ప్రభుత్వం ప్రతి అర్హులైన లబ్ధిదారులకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందించాలనే లక్ష్యంతో సచివాలయ వ్యవస్థను ఏర్పాటు చేసిందన్నారు. సచివాలయ ఉద్యోగులంతా తప్పనిసరిగా ప్రజలకు సేవ చేయాలని ఆదేశించారు. ప్రజలతో మర్యాదగా మాట్లాడుతూ వారి సమస్యలు తెలుసుకోవాలన్నారు. సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని ఆదేశించారు. ప్రతి ప్రభుత్వ పథకాన్ని క్షేత్రస్థాయిలో లబ్ధిదారులకు అందించాలని సచివాలయ సిబ్బందిని ఆదేశించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ బండి శేషన్న, మున్సిపల్ వైస్ చైర్మెన్లు వేముల జయరామిరెడ్డి, షంషాద్‌బేగం, వార్డు కౌన్సిలర్ పెద్దకోట్ల ఉష, వార్డు ఇన్‌చార్జ్ పెద్దకోట్ల శ్రీనివాసులు, కౌన్సిలర్లు, మున్సిపల్ అధికారులు, వైఎస్సార్‌సీపీ నాయకులు గుండా ఈశ్వరయ్య, కార్యకర్తలు, సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు పాల్గొన్నారు.

పారదర్శక పాలనతో అర్హులందరికీ న్యాయం

ప్రశాంతి నిలయం: గత టీడీపీ ప్రభుత్వంలో జన్మభూమి కమిటీల పేరుతో ప్రతి పథకానికి ఓ రేటు చొప్పున వసూలు చేసి ప్రజలను దోచుకుతిన్నారని ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం పుట్టపర్తి మున్సిపాలిటీ పరిధిలోని ఎనుములపల్లి శిల్పారామం గుట్ట ప్రాంతంలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఇంటింటికీ వెళ్లి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వివరించారు. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. సమస్యలకు వెంటనే పరిష్కారం చూపాలని అక్కడే ఉన్న అధికారులను ఆదేశించారు. పలువురు రోడ్లు వేయించాలని కోరారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ప్రజలకు జవాబుదారీగా ఉంటూ వారి సంక్షేమమే పరమావధిగా జగనన్న ప్రభుత్వం పని చేస్తోందన్నారు. ప్రతిపక్షాలు వైఎస్ జగన్ మోహన్‌రెడ్డిని ఎదుర్కోలేక తప్పుడు ఆరోపణలు చేస్తున్నాయని మండిపడ్డారు. అసత్య ఆరోపణలను నమ్మొద్దని ప్రజలకు సూచించారు. గతంలో అధికారంలో ఉన్న చంద్రబాబు రాయసీమ ప్రజల సమస్యలు పట్టించుకోలేదన్నారు. ఇప్పుడు అధికారం కోసం మొసలి కన్నీరు కారుస్తున్నారని ఆరోపించారు. రైతు రుణమాఫీ పసుపుకుంకుమ, నిరుద్యోగ భృతి వంటి పథకాలు పెట్టి ప్రజలను నిలువునా మోసం చేసిన చంద్రబాబు.. తిరిగి మరోమారు మోసం చేసేందుకు నాటకాలు మొదలు పెట్టాడన్నారు. అంతకుముందు పుట్టపర్తి మున్సిపాలిటీ పరిధిలో గడప గడపకూ మన ప్రభుత్వం పూర్తయిన సందర్భంగా ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డిని మున్సిపాలిటీ పరిధిలోని నాయకులు ఘజమాలతో సన్మానించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ తుంగా ఓబులపతి, వైస్ చైర్మెన్లు మరుట్ల శ్రీలక్ష్మి, మాతంగి తిప్పన్న పుడా చైర్‌పర్సన్ లక్ష్మీనరసమ్మ, మెప్మా అధ్యక్షురాలు సాయిలీల, టౌన్ కన్వీనర్ రంగారెడ్డి, కౌన్సిలర్లు సాయిగీత, చెరువు భాస్కర్‌రెడ్డి, పవన్ కుమార్, కో–ఆప్షన్ మెంబర్ రఫీ, మాజీ కౌన్సిలర్ నారాయణరెడ్డి, నాయకులు భాస్కర్‌రెడ్డి, నాగిరెడ్డి, కోగిరి సువర్ణ, కవిత, సుబ్రహ్మణ్యం, చితంబర్‌రెడ్డి, గోపాల్‌రెడ్డి, గంగాధర్, భాస్కర్, ఓబుల్‌రెడ్డి, ఎస్టీడీ నరసింహులు, ఫోటో సాయి, నరసింహులు, కేశప్ప, ఆర్‌ఎంపీ గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

జగనన్న కాలనీలో నీటి వసతి



బోరుకు మోటారు అమర్చుతున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

గాండ్లపెంట: మండల కేంద్రంలోని చిన్నమిట్ట వద్ద ఏర్పాటు చేస్తున్న జగనన్న కాలనీలో ఎంపీపీ నిధులతో బోరు వేయించారు. నీరు సమృద్ధిగా పడటంతో శుక్రవారం ఎంపీపీ తాతం జగన్మోహన్ ఆధ్వర్యంలో బోరుకు మోటార్ అమర్చారు. జగనన్న కాలనీలో నీటి సౌకర్యం కల్పించేందుకు ఎమ్మెల్యే డాక్టర్ పీవీ సిద్దారెడ్డి చొరవ తీసుకున్నట్లు ప్రజాప్రతినిధులు తెలిపారు. కార్యక్రమంలో హౌసింగ్ ఏఈ చంద్రారెడ్డి, కన్వీనర్ పోరెడ్డి చంద్రశేఖరరెడ్డి, జెడ్పీ కో–ఆప్షన్ సభ్యుడు ఫయాజ్‌అలీ, జేసీఎస్ మండల కన్వీనర్ గజ్జల రవీంద్రారెడ్డి, మాజీ జెడ్పీటీసీ సభ్యుడు భాస్కరరెడ్డి, బీసీ కన్వీనర్ నరసింహాగౌడ్, మైనార్టీ నాయకులు ఇక్బాల్, ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

తల్లిపాలతో పిల్లలకు రోగనిరోధక శక్తి



మాట్లాడుతున్న డిప్యూటీ డీఎంహెచ్ఓ సెల్వి సాల్మన్

ధర్మవరం అర్బన్: తల్లిపాలతోనే పిల్లలకు రోగనిరోధక శక్తి పెరుగుతుందని డిప్యూటీ డీఎంహెచ్ఓ సెల్వి సాల్మన్, సీడీపీఓ లక్ష్మి, డెమో అధికారి బాబా ఫకృద్దీన్ తెలిపారు. పట్టణంలోని సీడీపీఓ కార్యాలయంలో శుక్రవారం ప్రపంచ తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా అంగన్‌వాడీ కార్యకర్తలు, గర్భవతులు, బాలింతలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పిల్లలు పుట్టగానే వచ్చే ముర్రుపాలలో పోషక విలువలు చాలా ఉంటాయని తెలిపారు. తల్లిపాలను ఆరునెలల పాటు ఇవ్వడం వల్ల పిల్లలకు రోగనిరోధక శక్తి పెరుగుతుందన్నారు. గర్భిణులు, బాలింతలు అంగన్వాడీ కేంద్రాల్లో అందించే పౌష్టికాహారాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఆకుకూరలు, పండ్లు, గుడ్లు, మాంసం, చేపలను ఆహారంగా తీసుకోవాలన్నారు. అనంతరం ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ శ్రీదేవి, మెడికల్ సీఓ అన్న లక్ష్మీనారాయణ, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

రీసర్వే పారదర్శకంగా చేపట్టాలి



మాట్లాడుతున్న ఆర్డీఓ తిప్పేనాయక్

ధర్మవరం అర్బన్: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన వైఎస్సార్ జగనన్న శాశ్వత భూహక్కు భూరక్ష పథకంలో భాగంగా రీసర్వేను పారదర్శకంగా చేపట్టాలని ఆర్డీఓ తిప్పేనాయక్ తెలిపారు. స్థానిక ఆర్డీఓ కార్యాలయంలో శుక్రవారం ధర్మవరం డివిజన్‌లోని తహసీల్దార్లు, డీఐఓఎస్‌లు, మండల సర్వేయర్లు, రీసర్వే డిప్యూటీ తహసీల్దార్లు, విలేజ్ సర్వేయర్లు, వీఆర్వోలతో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్డీఓ మాట్లాడుతూ.. ఈనెల 31వ తేదీలోపు 23 గ్రామాల్లో రీసర్వే పూర్తి చేయాలన్నారు. సెప్టెంబర్ 10వ తేదీలోపు జేసీ లాగిన్‌లో కచ్చితంగా ఉండాలని తెలిపారు. ఈనెల చివరిలోపు తహసీల్దార్ లాగిన్‌లో రీసర్వే వివరాలు ఉండాలని ఆదేశించారు. రీసర్వే పూర్తయినప్పుడు ఆయా పొలాల్లో హద్దులు, రాళ్లు నాటించాలని సూచించారు. త్వరితగతిన రీసర్వే పూర్తి చేయాలన్నారు. కార్యక్రమంలో డీపీఓ కతిజున్ కుప్రా, తహసీల్దార్ యుగేశ్వరిదేవి, డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ సర్వేయర్ మురళి, అంజనప్ప, శ్యాముల్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

రెజ్లింగ్ పోటీల్లో ప్రతిభ



పతకాలు అందుకుంటున్న క్రీడాకారులు

హిందూపురం: వైజాగ్‌లో ఇటీవల నిర్వహించిన ఏపీ సబ్ జూనియర్స్ రెజ్లింగ్ రాప్లింగ్ చాంపియన్ షిప్ పోటీల్లో హిందూపురానికి చెందిన తొమ్మిదిమంది క్రీడాకారులు ప్రతిభ కనపర్చి గోల్డ్‌మెడల్స్ సాధించారు. కోచ్ శ్రీరంగరాజపల్లి రమేష్ ఆధ్వర్యంలో హిందూపురానకి చెందిన పది మంది క్రీడాకారులు పోటీల్లో పాల్గొనగా తొమ్మిది మంది వివిధ విభాగాల్లో బంగారు పతకాలు సాధించారు. అండర్–15లో షేక్‌సయ్యద్, ఎస్‌కే ముబీకుమార్, అస్లం, అండర్–13లో చందన, సుబం, కె.ఆర్.ప్రణవ్, శ్రీచరణ్, ధనుంజయ అండర్–11లోషేక్ యనియా పోటీల్లో గెలుపొంది ఆల్‌ఇండియా గ్రాప్లింగ్ కమిటీ చైర్మన్ దినేష్‌కపూర్ చేతుల మీదుగా పతకాలు అందుకున్నారు. రెజ్లింగ్‌లో ప్రతిభ కనపర్చిన విద్యార్థులను అభినందించారు. కార్యక్రమంలో చైతన్య గంగిరెడ్డి, లైఫ్‌వరల్డ్ చారిటబుల్‌ట్రస్టు కన్వీనర్ ఉదయ్‌కుమార్, ఎస్‌డిజిఐఎస్ కళాశాల ప్రిన్సిపల్ నాగేంద్రకుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే సిద్దారెడ్డి జన్మదిన వేడుకలు



కదిరి టౌన్: స్థానిక నాయకులతో కలసి కేక్ కట్ చేస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ పీవీ సిద్దారెడ్డి



కదిరి టౌన్: పట్టణంలో చేపట్టిన ర్యాలీలో అభివాదం చేస్తున్న ఎమ్మెల్యే సిద్దారెడ్డి

కదిరి టౌన్: ఎమ్మెల్యే డాక్టర్ పీవీ సిద్దారెడ్డి జన్మదినం సందర్భంగా శుక్రవారం కదిరి పట్టణంలో పండుగ వాతావరణం నెలకొంది. పట్టణంలోని బాలుర కళాశాలలో వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు ఏర్పాటు చేసిన కేక్‌ను ఎమ్మెల్యే సిద్దారెడ్డి కట్ చేశారు. పెద్ద ఎత్తున తరలివచ్చిన నాయకులు, ప్రజాప్రతినిధులు, అధికారులు ఎమ్మెల్యేకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. అంతకుముందు పట్టణంలో వైఎస్సార్‌సీపీ నాయకులు భారీ బైక్ ర్యాలీ చేపట్టారు. రక్తదాన శిబిరం నిర్వహించారు.

గాండ్లపెంట నుంచి కదిరికి బైక్ ర్యాలీ

గాండ్లపెంట: ఎమ్మెల్యే డాక్టర్ పీవీ సిద్దారెడ్డి జన్మదిన వేడుకలకు మండల పరిధిలోని 14 గ్రామ పంచాయతీల నుంచి భారీ సంఖ్యలో వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు శుక్రవారం కదిరికి తరలివెళ్లారు. ఈ సందర్భంగా స్థానిక వైఎస్సార్ కూడలిలో జై జగన్.. జైజై జగన్.. డాక్టర్ సిద్దారెడ్డి నాయకత్వం వర్ధిల్లాలి అంటూ నినాదాలు చేశారు. వైఎస్సార్ కూడలిలో ఒకవైపు మలమీదపల్లి నుంచి, మరోవైపు జీనులకుంట నుంచి కార్యకర్తలు పెద్ద ఎత్తున బైక్‌లపై వచ్చి కదిరికి తరలివెళ్లారు. కార్యక్రమంలో పార్టీ మండల కన్వీనర్ పోరెడ్డి చంద్రశేఖరరెడ్డి, ఎంపీపీ తాతం జగన్మోహన్, జెడ్పీ కో–ఆప్షన్ సభ్యుడు ఫయాజ్‌అలీ, జేసీఎస్ కన్వీనర్ గజ్జల రవీంద్రారెడ్డి, మాజీ జెడ్పీటీసీ భాస్కరరెడ్డి, బీసీ కన్వీనర్ జక్కల నరసింహాగౌడ్, సర్పంచుల సంఘం అధ్యక్షుడు రవీంద్రనాయక్, ఆర్బీకే మండల చైర్మన్ శంకర్‌నాయుడు, ఎంపీటీసీలు, సర్పంచులు పాల్గొన్నారు.

కట్నం వేధింపులు తాళలేక మహిళ ఆత్మహత్యాయత్నం

కదిరి టౌన్: పట్టణంలోని శివాలయం వీధిలో ఉన్న ఓ వివాహిత అదనపు కట్నం వేధింపులు తాళలేక శుక్రవారం రాత్రి విషద్రావకం సేవించి ఆత్మహత్యాయత్నం చేసింది. వివరాలు.. శివాలయం వీధిలో ఉన్న మారుతి కుమార్తె భార్గవిని రమేష్‌కు ఇచ్చి వివాహం చేశారు. భార్యాభర్తలు చింతమానులో కాపురం ఉంటున్నారు. భర్త రమేష్, అత్త, బంధువులు అదనపు వరకట్నం తీసుకురావాలని భార్గవిని వేధించేవారు. కట్నం తీసుకుని రాకపోతే మరొకరితో పెళ్లి చేస్తామని బెదిరించారు. కట్నం వేధింపులు తాళలేక ఇటీవల భార్గవి పుట్టింటికి చేరుకుంది. అయినా భర్త రమేష్ డబ్బులు తీసుకుని రావాలని ఫోన్‌లో తరచుగా వేధించేవాడు. శుక్రవారం రాత్రి ఇంట్లో ఎవరూ లేని సమయంలో భార్గవి విషద్రావకం సేవించింది. చుట్టుపక్కల వారు ఆమెను వైద్య చికిత్సల నిమిత్తం కదిరి ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అయితే పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన వైద్యం కోసం అనంతపురం తరలించినట్లు ఔట్‌పోస్టు పోలీసులు తెలిపారు. పట్టణ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

విధులు సక్రమంగా నిర్వర్తించాలి

అమడగూరు: గ్రామ, వార్డు సచివాలయాల్లోని మహిళా పోలీసులు సక్రమంగా విధులు నిర్వర్తించాలని దిశ డీఎస్పీ వరప్రసాద్ పేర్కొన్నారు. శుక్రవారం ఓడీచెరువులోని మండల పరిషత్ కార్యాలయంలో అమడగూరు, ఓడీచెరువు, నల్లమాడ మండలాల్లోని మహిళా పోలీసులతో ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు. మహిళా పోలీసుల పనితీరుపై ఆరా తీశారు. ఎస్ఐ గోపి పాల్గొన్నారు.

9న ఇంటర్వ్యూలు

పెనుకొండ: పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో అకౌంట్స్ అండ్ టాక్సేషన్ కోర్సు బోధించడానికి అర్హులు ఇంటర్వ్యూకు హాజరుకావాలని ప్రిన్సిపాల్ బషీర్ అహ్మద్ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఎంకాంలో 50 శాతం మార్కులతో ఉత్తీర్ణత సాధించిన వారు ఈనెల 9న ఒరిజినల్ సర్టిఫికెట్లతో పాటు రెండు సెట్ల జిరాక్సులతో ఉదయం 11 గంటలకు ఇంటర్వ్యూలకు హాజరుకావాలన్నారు.

వృద్ధురాలి నగల అపహరణ

పావగడ: పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలోని పిరొప్పంలో ఓ వృద్ధురాలికి అపరిచితులు మాయమాటలు చెప్పి బంగారు నగదు అపహరించాడు. వివరాలు.. గ్రామానికి చెందిన వృద్ధురాలు లక్ష్మమ్మ శుక్రవారం గ్రామ శివారులో గొర్రెలు మేపుతుండగా బైక్‌పై ఇచ్చిన ఇద్దరు అపరచితులు ఆమెతో మాటలు కలిపి మీ కుమారుడి కి లోన్ మంజూరైందని, దాని కోసం రూ.10 వేలు అవసరమని చెప్పారు. అయితే తన దగ్గర అంత సొమ్ము లేదని తేల్చి చెప్పింది. మీ కుమారుడు ఫోన్ లో మాట్లాడతాడు అని మొబైల్ ఆమె చెవి వద్ద ఉంచారు. అయితే ఆమె కుమారుడి గొంతుతో మాట్లాడిన అపరచితుడు మెడలోని 6 గ్రాముల బంగారు కమ్మలు, చైన్ ను వారికి ఇమ్మని చెప్పాడు. ఆమె అలాగే చేసింది. అనంతరం విషయం తెలుసుకుని పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేశారు.

రైతు ఆత్మహత్య



శ్రీరాములనాయక్ (ఫైల్)

నల్లమాడ: మండలంలోని కొత్తపల్లి తండాకు చెందిన రైతు దుంగావత్ శ్రీరాములనాయక్ (50) పురుగు మందు సేవించి ఆత్మహత్య చేసుకున్నాడు. సమీప బంధువులు, పోలీసులు తెలిపిన మేరకు వివరాలిలా ఉన్నాయి. శ్రీరాములు నాయక్, కుళ్లాయమ్మ దంపతులు వ్యవసాయంపై ఆధారపడి జీవనం సాగిస్తున్నారు. వీరికి ఓ కుమారుడు, కుమార్తె సంతానం. వీరికి వేళ్లమద్ది గ్రామ పొలంలో మూడు ఎకరాలు పొలం ఉంది. ప్రస్తుతం వేరుశనగ పంట సాగు చేశాడు. పంటల సాగు కోసం బ్యాంక్, ఇతరుల వద్ద రూ.రెండు లక్షల వరకూ అప్పులు చేశాడు. దీనికి తోడు శ్రీరాములు నాయక్ గత ఆరు నెలలుగా కడుపు నొప్పితో బాధపడుతున్నాడు. ఒక వైపు అప్పులు తీరకపోగా, కడుపు నొప్పికూడా నయం కావడం లేదంటూ మధన పడుతూ ఉండేవాడు. ఈ నేపథ్యంలో గురువారం రాత్రి వేరుశనగ పంటకు కాపలాగా వెళ్లిన ఆయన పంటకు పిచికారీ చేసేందుకు తెచ్చిన పురుగు మందు సేవించాడు. పక్క పొలానికి కాపలాగా వెళ్లిన సమీప బంధువు బొజ్జేనాయక్ గమనించి విషయాన్ని ఫోన్‌లో కుటుంబ సభ్యులకు తెలిపాడు. కుటుంబ సభ్యులు హుటాహుటిన అక్కడికి చేరుకుని 108లో శ్రీరాములునాయక్‌ను కదిరి ఏరియా ఆస్పత్రికి తరలించారు. అక్కడి వైద్యుల సూచనల మేరకు మెరుగైన వైద్యం కోసం అనంతపురం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ శుక్రవారం ఉదయం 11:30 గంటలకు మృతి చెందాడు. మృతుడి భార్య కుళ్లాయమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

కురుబ సంఘం అభివృద్ధికి పాటుపడాలి



ఐక్యత చాటుతున్న కురుబ సంఘం నాయకులు

పుట్టపర్తి టౌన్: కురుబ సంఘం అభివృద్ధికి ప్రతి ఒక్కరూ పాటుపడాలని ఆ సంఘం నాయకులు పిలుపునిచ్చారు. శుక్రవారం పట్టణంలోని సాయి ఆరామంలో కురుబ సంఘం కార్యవర్గాన్ని ఎన్నుకునేందుకు సమావేశం ఏర్పాటు చేశారు. తొలుత సంఘం అభివృద్ధిపై చర్చించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. శ్రీసత్యసాయి జిల్లా ఏర్పడిన అనంతరం కురుబ సంఘం కార్యవర్గాన్ని ఏర్పాటు చేసుకోవడం అనందంగా ఉందన్నారు. సంఘం అభివృద్ధిలో కార్యవర్గం చాలా కీలకం అన్నారు. పార్టీలకు అతీతంగా సంఘం అభివృద్ధికి ప్రతి ఒక్కరూ పాటుపడాలన్నారు. సత్యసాయి జిల్లాలో కురుబలు అధికంగా ఉన్నారని పేర్కొన్నారు. ఉమ్మడి జిల్లా నుంచి విడిపోయి నూతన కార్యవర్గాన్ని ఎన్నుకోనున్నట్లు వెల్లడించారు. కార్యక్రమంలో అనంతపురం కురుబ సంఘం జిల్లా అధ్యక్షుడు రాజహంస శ్రీనివాసులు, మాజీ అధ్యక్షుడు బోరంపల్లి ఆంజయులు, ఉపాధ్యక్షుడు నెమలి ఈశ్వరయ్య, కార్యదర్శి రాజేష్, నాయకులు సామకోటి ఆదినారాయణ, మల్లికార్జున, చెన్నప్ప, శివానంద, కమ్మన్న, ప్రభాకర్, కొండన్న, నాగరాజు, వెంకటేష్, ఆదినారాయణ తదితరులు పాల్గొన్నారు.

జిల్లాలు దాటుతున్న వలంటీర్ సేవలు



నల్లమాడ: చంద్రానాయక్‌కు పింఛన్ అందజేస్తున్న వలంటీర్ ఆనంద్‌నాయక్



బత్తలపల్లి: రాములమ్మ వేలిముద్ర తీసుకుంటున్న వలంటీర్ తరుణ్‌కుమార్ రెడ్డి

- తిరుపతికి వెళ్లి పింఛన్ అందజేత

బత్తలపల్లి: అప్రాచెరువు గ్రామానికి చెందిన కుర్లి రాములమ్మ పది రోజులుగా తిరుపతిలోని బర్డ్ ఆసుపత్రిలో చికిత్స పొందుతోంది. విషయం తెలుసుకున్న వలంటీర్ తరుణ్‌కుమార్ రెడ్డి శుక్రవారం ఆసుపత్రికి చేరుకుని పింఛన్ సొమ్ము అందజేశారు. వృద్ధురాలిని ఆప్యాయంగా పలకరించి ఆరోగ్య సమాచారం తెలుసుకున్నారు. తాను ఆసుపత్రిలో ఉన్నప్పటికీ ఇక్కడికే వచ్చి పింఛన్ అందజేయడంతో వలంటీర్‌కు రాములమ్మ కృతజ్ఞతలు తెలిపింది. విషయం తెలుసుకున్న ఎంపీపీ బగ్గిరి త్రివేణి, సర్పంచ్ మొరైడ్డిగారి శారదమ్మ, మండల కన్వీనర్ బయపరెడ్డి వలంటీర్‌ను అభినందించారు.

నల్లమాడ: మండలంలోని నీరాలవంక తండాకు చెందిన వలంటీర్ ఎం.ఆనంద్‌నాయక్ తిరుపతికి వెళ్లి పింఛన్ అందజేసి ఔదార్యం చాటుకున్నాడు. నీరాలవంక తండాకు చెందిన ఎం.పెద్ద చంద్రానాయక్ కుడి కాలికి ప్రమాదవశాత్తు గాయం కావడంతో పూర్తిగా దెబ్బతింది. కుటుంబ సభ్యులు అతడికి శ్రీ అన్నమయ్య జిల్లా పీలేరులోని ఓ ఆస్పత్రిలో చికిత్స చేయించారు. శుక్రవారం ఆయన ఆస్పత్రి నుంచి డిశ్చార్జి కావడంతో తిరుపతి జిల్లా యర్రవారిపల్లి మండలం, బోడేవాండ్లపల్లికి చేరుకున్నారు. విషయం తెలుసుకున్న వలంటీర్ ఆనంద్‌నాయక్ సొంత ఖర్చులతో దాదాపు 200 కిలోమీటర్లు వెళ్లి చంద్రానాయక్‌కు పింఛన్ మొత్తం అందజేశారు.

రికార్డుల పరిశీలన

అమడగూరు: స్థానిక పోలీస్‌స్టేషన్‌ను శుక్రవారం సీఐ రాజేంద్రనాథ్ యాదవ్ సందర్శించారు. రికార్డులను క్షుణ్ణంగా తనిఖీ చేశారు. అనంతరం ఎస్ఐ వెంకటనారాయణను అడిగి మండల వ్యాప్తంగా నడుస్తున్న కేసులపై ఆరా తీశారు. లోక్ అదాలత్‌లో కేసులను పరిష్కరించుకునేలా ఇరువర్గాలకు అవగాహన కల్పించాలని సూచించారు. మద్యం, గుట్కా సరఫరా కాకుండా అప్రమత్తంగా ఉండాలన్నారు.

వివాహిత అదృశ్యం

లేపాక్షి: మండలంలోని కల్లూరు గ్రామానికి చెందిన వివాహిత వాణి(25) అదృశ్యంపై కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ మునీర్‌అహమ్మద్ శుక్రవారం తెలిపారు. ఆమె భర్త భాస్కర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామన్నారు. గురువారం ఉదయం 11 గంటల నుంచి ఆమె కనబడడం లేదని ఫిర్యాదులో పేర్కొన్నారు.

రోడ్డు ప్రమాదంలో దంపతులకు గాయాలు

కదిరి అర్బన్: మండల పరిధిలోని ముత్యాలచెరువు సమీపంలో కదిరి–హిందూపురం రహదారిపై ద్విచక్ర వాహనం అదుపుతప్పిన ఘటనలో నల్లమాడ మండలం గూడమేకలపల్లికి చెందిన సోమశేఖర, దీప అనే దంపతులకు గాయాలయ్యాయి. వీరిద్దరూ సొంత పని నిమిత్తం ద్విచక్ర వాహనంలో కదిరికి వచ్చారు. తిరుగు ప్రయాణంలో ముత్యాలచెరువు సమీపంలో ద్విచక్ర వాహనానికి కుక్క అడ్డంగా రావడంతో కిందపడ్డారు. ఇద్దరికి స్వల్ప గాయాలు కావడంతో చికిత్స నిమిత్తం ఆటోలో కదిరి ఏరియా ఆసుపత్రికి తరలించారు.

ద్విచక్ర వాహనాన్ని ఢీకొన్న ట్రాక్టర్

- ఇద్దరికి స్వల్ప గాయాలు

ధర్మవరం అర్బన్: పట్టణంలోని సెరికల్చర్ కార్యాలయం సమీపంలో శుక్రవారం ద్విచక్ర వాహనాన్ని ట్రాక్టర్ ఢీకొన్న ఘటనలో ఇద్దరు స్వల్పంగా గాయపడ్డారు. వన్‌టౌన్ పోలీసులు తెలిపిన వివరాలు.. స్థానిక కొత్తపేటకు చెందిన షెక్షావలి, మహమ్మద్ యూసుఫ్ ద్విచక్ర వాహనంలో వస్తుండగా సెరికల్చర్ కార్యాలయం వద్ద ట్రాక్టర్ ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో గాయపడిని వీరిని స్థానికులు ధర్మవరం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

యాజమాన్య పద్ధతులతో అధిక దిగుబడులు



పంటల సాగుపై అవగాహన కల్పిస్తున్న వ్యవసాయాధికారులు

పుట్టపర్తి టౌన్: రైతులందరూ 14 వారాల పాటు సమగ్ర యజమాన్య పద్ధతులు పాటిస్తే తక్కువ పెట్టుబడితో ఎక్కువ లాభాలు పొందవచ్చని ఏడీఏ సనావుల్లా పేర్కొన్నారు. శుక్రవారం కొత్తచెరువు మండలం కొడపగానిపల్లి గ్రామంలో మండల వ్యవసాయ అధికారి నటరాజ్ ఆధ్వర్యంలో పొలం బడి కార్యక్రమం నిర్వహించారు. పంటల సాగుపై రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రైతు సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తోందన్నారు. అదే విధంగా రైతు భరోసా కేంద్రాల్లో అన్ని రకాల విత్తనాలు, ఎరువులు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. ఎరువులను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో సర్పంచ్ అలివేలమ్మ, ఎంపీటీసీ వరలక్ష్మి, సహకార సంఘం అధ్యక్షుడు రఘునాథ రెడ్డి, సాయికౌషిక్, ధనుంజయ తదితరులు పాల్గొన్నారు.

చేపలు పట్టుకునేందుకు నేడు వేలం

కదిరి అర్బన్: మండల పరిధిలోని కే.బ్రాహ్మణపల్లి పంచాయతీ పరిధిలోని చెర్లోపల్లి, వన్నెప్ప, చిన్నారప్పకుంట, బద్రెకుంట, కార్వేటి చెరువుల్లో చేపలు పట్టుకునేందుకు వేలం పాట నిర్వహించనున్నట్లు సర్పంచ్ ఖుర్షీన్, పంచాయితీ కార్యదర్శి గోపాల్ శుక్రవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. కే.బ్రాహ్మణపల్లి పంచాయతీ కార్యాలయం వద్ద వేలం నిర్వహిస్తామన్నారు. ఆసక్తిగల వారు రూ. 5 వేలు డిపాజిట్ చెల్లించి వేలం పాటలో పాల్గొనవచ్చని తెలిపారు.

ఉచిత కంప్యూటర్ శిక్షణ

కదిరి అర్బన్: పట్టణంలోని కోర్టు రోడ్డులో ఉన్న ఏపీ ఉర్దూ అకాడమీ ఉచిత కంప్యూటర్ ట్రెనింగ్ సెంటర్‌లో డొమెస్టిక్ డేటాఎంట్రీ ఆపరేటర్ కోర్సులో ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు అకాడమీ ఫ్యాకల్టీ సాజీదా సిద్దీఖీ శుక్రవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఆసక్తి గల యువతీ, యువకులు ఈనెల 17వ తేదీలోపు పేర్లను నమోదు చేసుకోవాలని సూచించారు. పదో తరగతి పాసై 40 ఏళ్లలోపు వయస్సు ఉన్న యువతీ, యువకులు కోర్సులో చేరేందుకు అర్హులని తెలిపారు. మైనార్టీలతో పాట ఇతర కులాలకు చెందిన వారు కూడా పేర్లను నమోదు చేసుకోవచ్చని సూచించారు. డొమెస్టిక్ డేటాఎంట్రీ ఆపరేటర్ కోర్సు కాలవ్యవధి 3 నెలలు ఉంటుందన్నారు. మరిన్ని వివరాలకు 8500077872 నంబర్‌కు సంప్రదించాలని కోరారు.

బదిలీ ఉద్యోగికి సన్మానం

అమడగూరు: ఉద్యోగులకు బదిలీలు తప్పనిసరి అని, ఉద్యోగులు చేసే సేవలే చిర స్మరణీయంగా ఉంటాయని పలువురు వక్తలు కొనియాడారు. మండల ఇన్‌చార్జ్ తహసీల్దార్‌గా నాలుగేళ్లు విధులు నిర్వహించిన రెడ్డిశేఖర్ ఓడీచెరువు మండలానికి బదిలీపై వెళ్లారు. శుక్రవారం చౌడేశ్వరీ కల్యాణ మండపంలో బదిలీ ఉద్యోగికి సన్మాన సభ ఏర్పాటు చేశారు. సమయ పాలన పాటిస్తూ ప్రజల సమస్యలను పరిష్కరించాలన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ వెంకటరెడ్డి, ఎంపీడీఓ మునెప్ప, ఎస్ఐ వెంకటనారాయణ, ఎంపీపీ ప్రసాద్‌రెడ్డి, కన్వీనర్ సూర్యనారాయణరెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకుడు శివశంకర్‌రెడ్డి పాల్గొన్నారు.

10న బహిరంగ వేలం

రామగిరి: నసనకోట సమీపంలోని ముత్యాలమ్మ ఆలయంలో ఈనెల 10న దుకాణాలు, ఇతర వాటికి బహిరంగ వేలం ఉంటుందని ఆలయ ఈఓ వెంకటేశ్వర్లు శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. దేవదాయశాఖ ఆధ్వర్యంలో నిర్వహించనున్న ఈవేలంలో పాల్గొనదలిచిన వారు డిపాజిట్ చెల్లించాలన్నారు. ఏడాది కాల పరిమితికి వేలం నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

11న మండల సర్వసభ్య సమావేశం

కనగానపల్లి: ఈనెల 11న మండల సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ అలివేలమ్మ తెలిపారు. శుక్రవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో మండల స్థాయి అధికారులతో చర్చించారు. ప్రతి మూడు నెలలకోసారి నిర్వహించనున్న మండల సర్వసభ్య సమావేశంలో ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలపై ప్రగతి నివేదికలను సమర్పించటంతో పాటు ప్రజా సమస్యలపై చర్చిస్తామన్నారు.

10న ఓబుళంపల్లిలో ఉచిత వైద్య శిబిరం

చెన్నేకొత్తపల్లి: పుట్టపర్తి సత్యసాయి సెంట్రల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఈ నెల10న ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు ట్రస్ట్ సభ్యులు శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. స్థానిక పాఠశాల ఆవరణలో ఉదయం 10 గంటలకు నిర్వహించనున్న వైద్యశిబిరంలో అన్ని రకాల వ్యాధులకూ ఉచితంగా వైద్యసేవలతోపాటు మందులు అందిస్తామన్నారు.